AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in





## రోబోటిక్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యత

**అక్షరటుడే, ఇందూరు:** ప్రస్తుత సమాజంలో రోబోటిక్స్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రంగారత్నం అన్నారు. భౌతిక శాస్త్రం సోహం అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో రోబోటిక్స్‌పై కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో అన్ని రంగాల్లో రోబోల వాడకం సర్వసాధారణమవుతోందన్నారు.


15-10-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## పోలీసుల వినూత్న ఆలోచన





నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్ రూరల్ ఎస్సై ఆరిఫ్ వినూత్నంగా ఆలోచించారు. నగరంలో అలాగే శివారు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలున్న చోట పోలీసు దుస్తుల్లో ఉన్న వ్యక్తి బొమ్మలను ఏర్పాటు చేయించారు. ప్రమాదాలు జరిగే అవకాశముందని వాహనాల వేగం తగ్గించి వెళ్లాలని సూచిస్తూ నిలబడ్డ ఈ బొమ్మలను నగరవాసులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ప్రమాదాలు తగ్గించేందుకు రూరల్ ఎస్సై ఆరిఫ్ తీసుకున్న ఈ చర్యలను ప్రశంసిస్తున్నారు. ఈ బొమ్మలను మల్కాపూర్ శివారులో రెండు మూడు చోట్ల, కంఠేశ్వర్ బైపాస్ లోని జీజీ కళాశాల వద్ద ఎస్సై సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్

## అక్రమ వసూళ్లపై చర్యలు..

### కానిస్టేబుల్‌పై బదిలీ వేటు

**అక్షరటుడే, నిజామాబాద్ :** పోలీస్ శాఖలో వసూళ్లకు పాల్పడుతున్న ఓ కానిస్టేబుల్‌పై బదిలీ వేటు పడింది. ఈ మేరకు నిజామాబాద్ సీపీ సాయి చైతన్య ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ ఒకటో టౌన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ ఖాలిద్‌పై సీపీ సాయిచైతన్య చర్యలు తీసుకున్నారు. బోధన్ టౌన్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తక్షణమే ఒకటో టౌన్ నుంచి రిలీవ్ చేయాలని ఎస్‌హెచ్‌వో రఘుపతిని ఆదేశించారు. కాగా.. ఒకటో టౌన్‌లో పనిచేస్తున్న ఖాలిద్ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో పాటు స్టేషన్ బెయిల్, పలు కేసుల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ విషయమై సీపీ సాయిచైతన్యకు పలువురు ఫిర్యాదు చేశారు. ఇదే విషయమై తాజాగా 'అక్షరటుడే'లో కథనం కూడా ప్రచురితమైంది. దీనిపై విచారణ జరిపించిన సీపీ సాయిచైతన్య ప్రాథమిక విచారణ అనంతరం కానిస్టేబుల్‌పై బదిలీ వేటు వేశారు. కాగా.. ఛార్జ్ మెమో కూడా జారీ చేయనున్నట్లు సమాచారం. ఒకటో టౌన్ పరిధిలో గత కొద్దినెలలుగా అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నట్లు బలమైన ఆరోపణలున్నాయి. ఏ చిన్న కేసును కూడా వదలకుండా ముక్కుపిండి మరీ డబ్బులు దండుకుంటున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఈ వ్యవహారంలో ఖాలిద్ తెరముందుండి వసూళ్లు చేసినప్పటికీ.. తెరవెనుక వసూళ్లు చేయించినవారు ఎవరనేది చర్చ జరుగుతోంది. వారిపై కూడా చర్యలు ఉంటాయని విశ్వసనీయ వర్గాల సమాచారం.



## ఆలయంపై హరివిల్లు

ఇంద్రధనస్సులను తరచూగా మనం చూస్తుంటాం.. కానీ ఏర్గట్ల మండల కేంద్రంలోని నరసింహస్వామి ఆలయంపై బుధవారం ఏర్పడిన ఇంద్ర దనస్సు చూపరులను ఆకట్టుకుంది. ఆలయాన్ని పూర్తిగా కప్పేసినట్లుగా విరిసిన ఈ హరివిల్లును ఫొటోగ్రాఫర్ పిట్ల రాము తన కెమెరాలో బంధించారు. – అక్షరటుడే, ఆర్మూర్



# పైసలిస్తేనే పనులు

ఇంటర్ విద్యా వ్యవస్థలో కొందరు అధికారులు యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారు. జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి కార్యాలయంలో ఓ అధికారి పైసలు ఇస్తేనే పనులు చేస్తున్నారు. లేదంటే ఆ ఫైళ్లను పక్కన పడేస్తున్నారు. ప్రైవేటు జూనియర్ కళాశాలలకు ఏ పని కావాలన్నా.. ఆయన చేయి తడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కాలేజీల యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. సదరు అధికారిపై ఫిర్యాదు చేయడానికి సైతం సిద్ధం అవుతున్నాయి.

- అక్షరటుడే, ఇందూరు

▸డీఐఈవో కార్యాలయంలో యథేచ్ఛగా అవినీతి ▸అందిన కాడికి దండుకుంటున్న ఓ అధికారి ▸ఫిర్యాదు చేసేందుకు యాజమాన్యాలు సిద్ధం

జిల్లాలో మొత్తం 44 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం రెన్యువల్, అపార్, విద్యార్థుల నమోదు, కళాశాలల తనిఖీలు తదితర ప్రక్రియ కొనసాగుతోంది. ఇంటర్ విద్యా శాఖలో ఒకప్పుడు ఇవన్నీ మాన్యువల్‌గా ఉండేవి. దీంతో అవినీతి జరిగేది. అవినీతికి అడ్డుకట్ట వేసి పారదర్శకత తీసుకు రావడం కోసం ఇంటర్ బోర్డు ఆన్‌లైన్ విధానాన్ని తీసుకువచ్చింది. అయినా కొందరు అధికారుల తీరు మారడం లేదు. ఏదో ఒక సాకుతో అందిన కాడికి దండుకుంటున్నారు.

### యాజమాన్యాలపై ఒత్తిడి

జిల్లాలోని చాలా జూనియర్ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని ఇంటర్ కార్యాలయంలోని ఓ అధికారి (పర్యవేక్షకుడు) యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా విద్యార్థుల అడ్మిషన్ ముగింపు పేరుతో వసూలు చేస్తున్నట్లు తెలిసింది. గతంలో విద్యార్థులు అడ్మిషన్ ప్రక్రియకు కళాశాలలో రిజిస్టర్‌ను ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం పూర్తిగా ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి వచ్చింది. కానీ సదరు అధికారి మాత్రం ఇప్పటికీ పాత విధానం పేరుతో రిజిస్టర్ ఏర్పాటు చేయాలంటూ.. వసూలుకు పాల్పడుతున్నట్లు సమాచారం.

### యాజమాన్యాల అసంతృప్తి

కాసుల కోసం కాలేజీలను వేధిస్తున్న అధికారిపై యాజమాన్యాలు ఆగ్రహంగా ఉన్నాయి. ప్రతిసారి డబ్బులు అడిగితే తాము ఎలా బతకాలని పలువురు కాలేజీ యజమానులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సదరు అధికారిపై ఇప్పటికే పలుసార్లు ఇంటర్ విద్యాధికారి దృష్టికి తీసుకొని వచ్చినట్లు తెలిసింది. ఇదే వ్యవహార శైలితో ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సైతం సిద్ధం అవుతున్నట్లు సమాచారం. సదరు అధికారిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలు కాలేజీల నిర్వాహకులు కోరుతున్నారు.

## ధాన్యం సేకరణ సజావుగా కొనసాగేలా ఏర్పాట్లు: కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు :** ఖరీఫ్ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించే ప్రక్రియ సజావుగా కొనసాగేలా విస్తృత స్థాయిలో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి బుధవారం మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ కోసం జిల్లాలో చేపట్టిన ఏర్పాట్ల గురించి కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంత్రులకు వివరించారు. జిల్లాలో ఈసారి 4.37 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఇప్పటికే జిల్లాలో 254 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. గత సీజన్‌లో 606 కేంద్రాలు ఉండగా ఈసారి 676 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకు 1,582 అదనపు టార్పాలిన్లు కేటాయించాలని కలెక్టర్ కోరారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణ సజావుగా జరగాలని మంత్రులు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 66.50 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ధాన్యం సాగుచేసినందున 148 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు చేతికందే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సుమారు 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చొప్పున మద్దతు ధర చెల్లించడంతో పాటు సన్నరకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 500 బోనస్ అందించనుందని తెలిపారు. ధాన్యం విక్రయించిన ఎనిమిది గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లోకి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్‌డీవో సాయా గౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయ్స్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, డీటీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



## నేర రహిత కమిషనరేట్‌గా మార్చేందుకు కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్‌ను నేరరహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దేందుకు తనవంతు కృషి చేస్తానని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈమేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో చోరీలు జరిగితే రికవరీలు కష్టంగా ఉండేదన్నారు. దాడుల జరిగిన సంఘటనల్లో సైతం నిందితులను పట్టుకోవడం ఇబ్బందిగా మారేదని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిందని స్పష్టం చేశారు. కమిషనరేట్ పరిధిలో జనాభా పెరిగిందని సీపీ పేర్కొన్నారు. దీంతో పాటు సినిమా థియేటర్లు, బంగారు దుకాణాలు, వస్త్ర వ్యాపారాలు, విద్యాసంస్థలు, అపార్టుమెంట్లు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయన్నారు. వీటితో పాటు నేరాల సంఖ్య పెరుగుతూ వచ్చిందన్నారు. అయితే ఈ మధ్యకాలంలో కమిషనరేట్ పరిధిలో క్రైంరేటు తగ్గించేందుకు విశేషంగా కృషి చేసినట్లు సీపీ పేర్కొన్నారు. అయితే నేరాల నుంచి విముక్తి పొందాలంటే ప్రతిచోటా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సీపీ పేర్కొన్నారు. దీంతో నేరం జరిగినప్పటికీ సొత్తు రికవరీ సులభమవుతుందన్నారు. వ్యాపార సంస్థలు, విద్యాసంస్థల వద్ద ప్రతి పని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీ కేసులను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని సీపీ స్పష్టం చేశారు.



## బంద్‌కు జిల్లా ప్రజలు సహకరించాలి..

**అక్షరటుడే, ఇందూరు:** బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18న తలపెట్టిన తెలంగాణ బంద్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సంస్థలు, మర్చంట్ అసోసియేషన్‌లకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ పోరాటం న్యాయపోరాటమని, అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నగర అధ్యక్షుడు దేవేందర్, శంకర్, అజయ్, స్వామి, విజయ్, బాలన్న, చైతన్య పాల్గొన్నారు.



## ఆర్వోబీలకు నిధులు విడుదల చేయకపోతే నిరాహార దీక్ష చేస్తా: ఎంపీ

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ఆర్వోబీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకుంటే వారంలో నిరాహార దీక్ష చేపడతానని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అడవి మామిడిపల్లి ఆర్వోబీకి రూ.22 కోట్లు అవసరమైతే, కొన్ని ఏళ్ల క్రితమే సుమారు రూ.18 కోట్లు డిపాజిట్ చేసినట్లు తెలిపారు. అయితే గత ప్రభుత్వం నిధులను మళ్లించిందన్నారు. అలాగే మాధవనగర్ ఆర్వోబీకి కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో 70శాతం వచ్చాయన్నారు. బిల్లులకు సంబంధించి జిల్లా అధికారులు తమ బాధ్యతలను నిర్వర్తించాలని ఎంపీ సూచించారు. రెండు నెలల క్రితం కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోసం కాకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఆర్వోబీ నిధులపై సరైన అవగాహన లేదని ఎంపీ విమర్శించారు. ముందుగా సబ్జెక్ట్ తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. కేంద్ర నిధులే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీజేపీపై బురద జల్లి బీఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నం చేస్తోందన్నారు. కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వమే కమిటీ వేసి అవకతవకలు ఉన్నాయని తేలినా.. ఏమి చేయడం లేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కవిత రాజీనామా లేఖ ఇస్తే ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. దేశభద్రతకు కల్వకుంట్ల కుటుంబం పెద్ద ముప్పు అని విమర్శించారు. సమావేశంలో పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు పోతంచర్ల లక్ష్మీనారాయణ, నాగోల్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగం బాధ్యతతో కూడుకున్నది: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** పోలీస్ ఉద్యోగం బాధ్యత, సేవతో కూడుకున్నదని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కొత్త రికార్డు రూంను ప్రారంభించి పరిశీలించారు. స్టేషన్ పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసుల ప్రగతిని సమీక్షించారు. ఎలాంటి కేసులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాలు జరిగిన ప్రాంతాలను సర్కిల్ మ్యాప్‌లో స్పష్టంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.




## కార్యకర్తల నిర్ణయం మేరకే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక



**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయం మేరకే డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందని ఏఐసీసీ పరిశీలకుడు, బెంగళూరు ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్ పేర్కొన్నారు. ఆర్మూర్, నందిపేట్ బ్లాక్‌ల వారీగా బుధవారం అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయాన్ని సేకరిస్తామని ఆయన స్పష్టం చేశారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, నందిపేట్ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు భూమేశ్వర్ రెడ్డి, మాక్లూర్ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్, ముఖ్య నాయకులు బూత్ అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, మండల గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు ముప్కాల్ విద్యార్థి ఎంపిక

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సుంకరి నయన్ జిల్లాస్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం జె.రవికుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ 17 ఎస్జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న తమ విద్యార్థి సుంకరి నయన్ తన ప్రతిభతో జిల్లాజట్టుకు ఎంపికైనట్లు వారు తెలిపారు. రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.



## రాష్ట్రస్థాయి పోటీలకు చౌట్‌పల్లి విద్యార్థి..

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ఎస్జీఎఫ్ అండర్ 17 వాలీబాల్ పోటీల్లో మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.మహేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఆంధ్రయ్య పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి మహేష్‌ను హెచ్ఎం ఆంధ్రయ్య, ఫిజికల్ డైరెక్టర్ నగేష్, ఉపాధ్యాయులు బంతిలాల్, మధు బాబు, నరేందర్, గంగాధర్, సీఆర్పీలు రాజేష్, అంజయ్య సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా రాణించి జాతీయస్థాయికి ఆడాలని ఆకాంక్షించారు.

## ప్రతిఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



**అక్షరటుడే, మాక్లూర్:** ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని వైద్యుడు అరవింద్ సూచించారు. సీపీఆర్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా మాక్లూర్ కేజీబీవీలో ఆర్‌బీఎస్‌కే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యుడు అరవింద్ మాట్లాడుతూ.. ఈరోజుల్లో వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు సంభవిస్తోందన్నారు. ఆహార అలవాట్లు, శరీరానికి వ్యాయామం లేకపోవడం కారణంగా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. గుండెపోటు వచ్చిన వారికి సీపీఆర్ చేస్తే బాధితుడిని కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే సిబ్బంది వినయ, రాకేశ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ తెలంగాణ బంద్‌కు సీపీఐ మద్దతు



**అక్షరటుడే, ఇందూరు:** బీసీ జేఏసీ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు సీపీఐ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి సుధాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. బిల్లును ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. బీసీ బిల్లును పలు అగ్రవర్ణ కులాలు అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోవడానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వమని విమర్శించారు. సమావేశంలో నగర కార్యదర్శి ఓమయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.





# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మచ్చర్ల సొసైటీ ఛైర్మన్ తాంబూరి శ్రీనివాస్ అన్నారు. ఆలూర్ మండలం కేంద్రంలోని మచ్చర్లలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. రైతులు ఈ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. తగిన తేమ శాతం ఉన్న స్వచ్ఛమైన ధాన్యాన్ని మాత్రమే కేంద్రాలకు తీసుకురావాలన్నారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన ప్రతిగింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ఛైర్మన్ చేపూర్ రాజేశ్వర్, ఆర్మూర్ ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, డైరెక్టర్లు ప్రమోద్, బార్ల సంతోష్ రెడ్డి, అరె రాజేశ్వర్, కట్ట నర్సయ్య, వెల్మ నర్సరెడ్డి, పచ్చుక నాగన్న, కళ్లెం సాయ రెడ్డి, కళ్లెం బొజ రెడ్డి ఇంగు గోవర్ధన్, సింగిడి మల్లు బాయి వీడీసీ సభ్యులు సీఈవో మల్లేష్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

### దేగాం గ్రామంలో..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని దేగాం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సొసైటీ వైస్ ఛైర్మన్ రాజేశ్వర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ దేగాం ప్రమోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. దళారులను ఆశ్రయించకుండా నేరుగా ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో మల్లేష్, డీపీవో సదానందం, డైరెక్టర్ రాజేశ్వర్, పంచాయతీ సెక్రెటరీ నవీన్, సిబ్బంది ముత్యం, వీడీసీ సభ్యులు మూతన్న, కన్నా గౌడ్, పొట్టన్న, రవి తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు టీకాలు

**అక్షర టుడే, మెండోరా :** ముప్కాల్ మండలంలోని నల్లూర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాడి రైతులకు చెందిన 182 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి గౌతమ్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలు పైబడిన ఆవులు, గేదెలు, ఎడ్లకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ప్రవీణ్, గోపాలమిత్ర ప్రణీత్, మల్లేష్, షకీల్, బషీర్ పాల్గొన్నారు.

### ఆలూర్‌లో..

**అక్షరటుడే, ఆర్మూర్:** మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. వైద్యులు సందీప్ ఆధ్వర్యంలో దాదాపు 65 గేదే జాతి, 31 గోజాతి పశువులకు టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం ఒక్కటే మార్గమన్నారు. వ్యాధి సోకిన పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుందని.. ఈ టీకాల ద్వారా వ్యాధిని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.






## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

**అక్షరటుడే, బోధన్:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయాలు జరగకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. ఎడపల్లి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే నిత్యం క్రయవిక్రయాలు నిర్వహించడం లేదని పేర్కొంటూ రైతులు బుధవారం మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనతో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. వారికి నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

## బీసీ సంఘాల జేఏసీ ఏర్పాటు



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలో బుధవారం బీసీ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాలు సమావేశమై జేఏసీని ఏర్పాటు చేశారు. జేఏసీ కన్వీనర్ గాండ్ల రవీందర్ యాదవ్, వర్కింగ్ ఛైర్మన్‌గా మారోజు సుధాకర్ చారిని ఎన్నుకున్నారు. కో-కన్వీనర్లుగా గుమ్ముల అశోక్ రెడ్డి, అబ్బకోని గంగాధర్ గౌడ్, సిరివెరి సంతోష్, తదితరులను ఎన్నుకున్నారు.


## జీవితంపై విరక్తితో ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జీవితంపై విరక్తి చెంది ఓ ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. నగరంలో ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని దుబ్బ ప్రాంతానికి చెందిన ట్రాన్స్‌జెండర్ మీర కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన మీరా మంగళవారం నిజామాబాద్ - జానకంపేట్ రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని రైలుకు అడ్డువెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు.


సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు రైల్వే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

# జాతీయ రహదారిపై ఘోరం..

- రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- పిల్లలకు టీకా కోసం వెళ్తుండగా ఘటన







**అక్షరటుడే, కామారెడ్డి:** తన ఇద్దరు పిల్లలకు టీకా కోసం తండ్రితో స్కూటీపై వెళ్తుండగా, టిప్పర్ ఢీకొని నలుగురు మృతి చెందారు. ఇద్దరు పిల్లలతో పాటు తల్లి, యువతి తండ్రి మృతి చెందిన ఘటన భిక్కనూరు హైవేపై చోటు చేసుకుంది. ఈ హృదయ విదారక ఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌కు చెందిన కిషన్ కూతురు జస్లిన్‌కు ఖమ్మం జిల్లా ముష్టిపల్లికి చెందిన ప్రకాశ్ వివాహం కాగా, వీరికి జోయల్ ప్రకాష్ (4), జోయల్ జడ్సన్ (5 నెలలు) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల ఆదిలాబాద్‌కు పిల్లలతో వచ్చిన జస్లిన్ కామారెడ్డిలో తెలిసిన వాళ్ల కోసం మంగళవారం వచ్చారు. రాత్రి కామారెడ్డిలోనే బస చేయగా, తన ఇద్దరు పిల్లలకు టీకాలు ఇవ్వాల్సి ఉండడంతో తండ్రి కిషన్‌తో కలిసి భిక్కనూరులో తెలిసిన ఏఎన్ఎం వద్దకు పిల్లలను తీసుకుని బయలుదేరారు. జంగంపల్లి హైవేపైకి రాగానే జంగంపల్లి గ్రామం నుంచి రాంగ్ రూట్‌లో వెళ్తున్న మొరం టిప్పర్ స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీ నుజ్జునుజ్జు కాగా.. దానిపై ఉన్న కిషన్, కూతురు జస్లిన్ ఎగిరి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందారు. స్కూటీలో ఇరుక్కున్న జోయల్ ప్రకాష్, జోయల్ జడ్సన్‌లను స్థానికులు కష్టపడి బయటకు తీశారు. జోయల్ ప్రకాష్ కొన ఊపిరితో ఉండడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆస్పత్రిలో సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు. గాయాలపాలైన జడ్సన్ కూడా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మృతుల బంధువులకు సమాచారం అందించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఆర్థికసాయం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో ప్రతిభ కలిగిన ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. స్థానిక అర్వపల్లి పురుషోత్తం కల్యాణ మండపంలో శ్రీ వాసవి సేవా సమితి ట్రస్ట్ నిజామాబాద్ ఆధ్వర్యంలో 'విద్యానిధి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు అర్వపల్లి పురుషోత్తం మాట్లాడుతూ.. నిరుపేద, ప్రతిభ కలిగిన ఆర్యవైశ్య విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట రమణ, ముక్కా వినోద్, వెండి, బంగారు వర్తకుల సంఘం అధ్యక్షుడు పాల్దె లక్ష్మీకాంతం, ట్రస్ట్ అధ్యక్షుడు పాల్దె రాజేశ్వర్, జిల్లా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు మోటూరి మురళి, పట్టణ సంఘం మాజీ అధ్యక్షుడు విశ్వనాథం శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.






## సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సూచించారు. నగరంలోని నిశిత డిగ్రీ కళాశాలలో డిజిటల్ అరెస్ట్ మోసాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల పేరుతో పలువురు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌హెచ్‌వో సూచించారు. సైబర్ మోసగాళ్లు ఇటీవల పోలీస్ యూనిఫాంలో వీడియో కాల్ చేస్తూ మీ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడ్డారని బెదిరిస్తున్నారని చెప్పారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిశిత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి బోశెట్టి మురళి డిమాండ్ చేశారు. డిచ్‌పల్లిలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు పూర్తవుతున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని వారు పేర్కొన్నారు. రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని వారు సూచించారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు వాసరి మోహన్, రాజేందర్, శకుంతల, కిషన్ పోశయ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.



## చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డిచ్‌పల్లి ఎస్సై మహమ్మద్ ఎండి షరీఫ్ అన్నారు. డిచ్‌పల్లి రైల్వే స్టేషన్ ఎదుట బుధవారం ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. రైల్వే స్టేషన్ ఎదుట రోడ్డు పక్కన పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు రైల్వే స్టేషన్ ముందు భాగంలో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నూతనంగా ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాప్ బోర్డులను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వినోద్, రాజేందర్, దశరథ్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

**అక్షరటుడే, బోధన్:** సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలో పేకాడుతున్నారన్న సమాచారంతో మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. దీంతో పేకాట ఆడుతున్న ముగ్గురుని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 15 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

### కోటగిరిలో..

**అక్షరటుడే,కోటగిరి:** మండల కేంద్రంలోని ఓ పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు చేశారు. అక్కడ పేకాటాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,610, ఐదు మొబైళ్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇంటి ఓనర్‌తో సహా 12మందిపై కేసు నమోదు చేసి, రూ.15,190, 10 మొబైళ్లు, 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.